సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 6 । జూలై । 2025



రేబిస్‌తో జాగ్రత్త 8లో ▸

పశుపోషకులు, జంతు, పక్షి ప్రేమికులు జూనోసిస్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు సూచిస్తున్నారు.



గ్రామాల్లో మొహర్రం సందడి

గ్రామాల్లో మొహర్రం సందడి మొదలైంది. కులమతాలకతీతంగా పీరీలకు పూజలు చేస్తూ మొక్కులు తీర్చుకుంటున్నారు. 9లో ▸

గరిష్టం/కనిష్టం
29.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

11న మెగా జాబ్‌మేళా

కైలాస్‌నగర్: ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకున్న జిల్లా విద్యార్థుల ప్రయోజనార్థం ఈనెల 11న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో ఉదయం 9గంటలకు ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. హెచ్‌సీఎల్ సంస్థ నిర్వహిస్తున్న టెక్ బీ కార్యక్రమంలో భాగంగా 2024–25లో ఎంపీసీ, ఎంఈసీ, సీఈసీ, బైపీసీ, వొకేషనల్ కంప్యూటర్‌లో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఓవరాల్‌గా 75శాతం, మ్యాథమెటిక్స్‌లో 60శాతం మార్కులు పొందిన విద్యార్థులు సర్టిఫికెట్లతో సంబంధిత హాజరుకావాలని సూచించారు. వివరాలకు హెచ్‌సీఎల్ ప్రతినిధిని 8074065803, 7981834205 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇంద్రవెల్లి హెచ్‌ఎంపై ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: పాఠశాల అభివృద్ధి నిధులు, వనరులు దుర్వినియోగం చేయడంతో పాటు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇంద్రవెల్లి జెడ్పీఎస్ఎస్ హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని టీటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం సాయంత్రం కలెక్టర్ రాజర్షి షాను కలిసి ఫిర్యాదు చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ నాయకులు సుదర్శన్, భూమన్న, జలందర్‌రెడ్డి ఉన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఎస్ఈ చౌహాన్

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయ చాంబర్‌లో ఆ శాఖ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేలాడుతున్న విద్యుత్ తీగలు, వంగిన స్తంభాలు, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. 33కేవీ, 11కేవీ లైన్స్ పెట్రోలింగ్ చేసి సమస్యలు గుర్తించడంతో పాటు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. డిష్, ఇంటర్నెట్ కేబుల్ ఆపరేటర్స్ పోల్ చార్జీలు కట్టని పక్షంలో వారి నుంచి వెంటనే వసూలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అగ్రికల్చర్ సర్వీస్‌లను వెంటనే రిలీజ్ చేయాలని, ఆయా మండలాల అసిస్టెంట్ ఇంజినీర్స్ పెండింగ్ బిల్లులు వందశాతం వసూలు చేయాలన్నారు. ఇందులో డివిజనల్ ఇంజినీర్స్, అకౌంట్స్ ఆఫీసర్స్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్స్, అసిస్టెంట్ ఇంజినీర్స్ తదితరులు పాల్గొన్నారు.

రా.. రమ్మని

ఆకర్షిస్తున్న సర్కారు బడులు

- కార్పొరేట్ తరహా వసతులు
- ఏఐ, డిజిటల్ బోధన, యోగాతో ఆకట్టుకుంటున్న వైనం
- ప్రత్యేకత చాటుతున్న ప్రభుత్వ పాఠశాలలు

సండే స్పెషల్

సర్కారు బడి అంటే చిన్నచూపు ధోరణి మారుతోంది. ప్రస్తుతం ఇవి కార్పొరేట్‌కు దీటుగా దర్శనమిస్తున్నాయి. నాణ్యమైన విద్యాబోధనతో పాటు అధునాతన సదుపాయాలతో ఆకర్షిస్తున్నాయి. ఏఐ బోధన, యోగా, కిచెన్‌గార్డెన్లు, గ్రంథాలయాలతో ఆకట్టుకుంటున్నాయి. విద్యార్థులను రా..రమ్మని ఆకర్షిస్తున్నాయి. తల్లిదండ్రుల ఆదరణతో ఏటా ప్రవేశాలు సైతం పెరుగుతున్నాయి. జిల్లాలో ఇలాంటి పాఠశాలలను ఓ సారి పరిశీలిద్దామా మరి.

–ఆదిలాబాద్‌టౌన్/ సాత్నాల/నార్నూర్



రణదీవేనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగాభ్యసనలో విద్యార్థులు

ఆదర్శం.. రణదీవేనగర్



కంప్యూటర్ విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఆదిలాబాద్‌లోని రణదీవేనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆదర్శంగా నిలుస్తోంది. ఇందులో 343 మంది విద్యార్థులున్నారు. 20 కంప్యూటర్లతో విద్యాబోధన సాగుతుంది. ఇక్కడ ఏఐ ద్వారా పాఠాలు బోధిస్తున్నారు. మూడు డిజిటల్ ప్యానెల్ బోర్డులు ఉన్నాయి. ప్రత్యేక గ్రంథాలయం, ప్రావీణ్య ఏజెన్సీ ద్వారా ఎక్స్‌ట్రా కరిక్యులం, శిరోస్ నిర్వహణ, న్యూట్రిషియన్ గార్డెన్, మన బడి, మన తోట ద్వారా పండించిన కూరగాయలను మధ్యాహ్న భోజనానికి వినియోగిస్తున్నారు. ఈ ఏడాది 114 అడ్మిషన్లు అయినట్లు ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్ తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు.

గూడా పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు



గూడాకు కార్పొరేట్ లుక్



డెస్క్ బెంచీల్లో కూర్చున్న విద్యార్థులు

భోరజ్ మండలంలోని గూడా ప్రాథమిక పాఠశాల కార్పొరేట్ లుక్‌తో ఆకట్టుకుంటుంది. డెస్క్ బెంచీలు, డిజిటల్ విద్యాబోధనతో ప్రత్యేకంగా నిలుస్తోంది. ఆహ్లాదకరమైన వాతావరణంతో ఈ బడి ఆకర్షిస్తోంది. ఈ ఏడాది 21 మంది ప్రవేశాలు పొందారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 56కు చేరింది. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, వారిలో పోటీతత్వం అలవడేలా కృషి చేస్తున్నామని హెచ్‌ఎం సాంబయ్య చెబుతున్నారు.

ప్రైవేట్‌కు దీటుగా..యాపల్‌గూడ



టై, బెల్టులతో విద్యార్థులు

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ ప్రాథమిక పాఠశాలకు జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇది ప్రైవేట్‌కు దీటుగా కొనసాగుతుంది. ఇందులో 320 మంది విద్యార్థులున్నారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన సాగుతుంది. ఆవరణలోకి అడుగుపెట్టగానే పూల మొక్కలు స్వాగతం పలికేలా కనిపిస్తాయి. పిల్లల కోసం ఊయాలలు, కిచెన్‌గార్డెన్ అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల మాదిరిగా టై, బెల్టు, షూ ధరించి బడికి హాజరవుతారు. ఇక్కడ కంప్యూటర్,ఏఐ ద్వారా విద్యాబోధన ప్రత్యేకం. పాఠశాలలో ఆరుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ ఏడాది దాదాపు వంద అడ్మిషన్లు అయ్యాయి. చుట్టుపక్కల గ్రామాలతో పాటు ప్రైవేట్‌కు వెళ్లేవారు సైతం చేరుతున్నారని ప్రధానోపాధ్యాయుడు గంగన్న పేర్కొన్నారు.

బొమ్మలు పలకరించేలా.. తాంసి



బొమ్మలతో తరగతి గదిలో..

తాంసిలోని ప్రాథమిక పాఠశాల ఆవరణతో పాటు తరగతి గదులు ఆకర్షణీయంగా కనిపిస్తాయి. విద్యార్థులకు నూతన ఉత్సాహం నింపేలా పలు చిత్రాలను హెచ్‌ఎం కవిత స్వయంగా గోడలపై తీర్చిదిద్దారు. ఆవరణ సైతం పూల మొక్కలతో ఆహ్లాదం పంచుతుంది. ఇందులో 132 మంది విద్యార్థులు ఉండగా వారికి ఐదుగురు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఈ ఏడాది ప్రైవేట్‌కు వెళుతున్న 25 మంది ఇందులో కొత్తగా చేరారు. టీఎల్‌ఎంతో విద్యాబోధన సాగుతుంది. దీంతో విద్యార్థులు సులువుగా నేర్చుకుంటున్నారు.

సకల హంగులతో.. భరంపూర్



ప్రత్యేక డ్రెస్ కోడ్‌లో విద్యార్థులు

తలమడుగు మండలంలోని భరంపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆధునాతన హంగులతో కూడిన విద్యాబోధన అందిస్తున్నారు. కంప్యూటర్ విద్యతో పాటు డిజిటల్ పాఠాలు బోధిస్తున్నారు. వేసవి సెలవుల్లో సైతం విద్యార్థులకు హాకీ, డ్యాన్స్ ఇతర శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతీ ఆదివారం విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ కల్పిస్తున్నారు. ఇందులో ప్రభుత్వమిచ్చిన యూనిఫాంలే కాకుండా విద్యార్థులకు ప్రత్యేక డ్రెస్‌కోడ్ ఉంది. ఇందులో 256 మంది విద్యార్థులుండగా ఈ ఏడాది 53 మంది అడ్మిషన్ పొందినట్లు హెచ్‌ఎం ప్రత్యూష తెలిపారు. బాలసభ నిర్వహణ, ప్రొజెక్టర్ ద్వారా విద్యాబోధన, ఐఎఫ్‌డీ డిజిటల్ ప్యానెల్ సౌకర్యాలు ఇక్కడ ప్రత్యేకత చాటుతున్నాయి.

ఆటపాటలతో ఆకట్టుకుంటున్న.. నార్నూర్

నార్నూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నారు. ఇందులో గతేడాది 61 మంది విద్యార్థులు ఉండగా ఈ ఏడాది నిర్వహించిన బడిబాటలో కొత్తగా 40 మంది చేరారు. ఆటపాటలతో పాటు క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన అందిస్తుండడంతో ఆదరణ పెరగుతోందని ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ తెలిపారు.

నార్నూర్ పాఠశాలలో ఆటలో నిమగ్నమైన చిన్నారులు



బాధ్యతతో విధులు నిర్వర్తించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



పోలీసులకు సూచనలందిస్తున్న ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: పోలీస్ సిబ్బంది యూనిఫాం గౌరవం పెంచేలా మరింత బాధ్యతతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో శనివారం నిర్వహించిన పోలీస్ పరేడ్‌ను పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన పాటించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీ శనివారం ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌తో పాటు జిల్లాలోని అన్ని పోలీస్ కార్యాలయాల్లో పరేడ్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు బి.సునీల్‌కుమార్, ప్రేమ్ కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి. వెంకటి, టి. మురళి, చంద్రశేఖర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ సిబ్బంది పాల్గొన్నారు.

హోంగార్డు కుమార్తె చదువుకు ఆర్థిక సాయం

ముంబాయి ఐఐటీలో జియో ఫిజిక్స్ కోర్సులో సీటు పొందిన హోంగార్డు పునరామ్ కుమార్తె వైష్ణవిని ఎస్పీ శనివారం ప్రత్యకంగా అభినందించారు. ఆమెకు ఉన్నత చదువు నిమిత్తం రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు.ఇందులో సూపరింటెండెంట్ సులోచన, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వామన్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు అంతంతే

- జూన్‌లో సాధారణంగా నమోదు
- ఈనెలలో చెదురుముదురుగానే..
- భారీ వర్షాలు కురిస్తేనే పూర్తిస్థాయికి జలాశయాలు

సాక్షి, ఆదిలాబాద్: జిల్లాలోని జలాశయాల్లోకి క్రమంగా నీరు చేరుతుంది. జూన్‌లో జిల్లావ్యాప్తంగా సాధారణ వర్షాపాతం నమోదైంది. ఆ నెలలో తక్కువ రోజులు మాత్రమే వర్షం కురిసింది. అది కూడా మోస్తరుగానే. జూలై ప్రవేశించినా ఇంకా ప్రాజెక్టులు, చెరువుల్లో పూర్తిస్థాయి జలకళ కనిపించడం లేదు. రాష్ట్రంలో నాలుగు జిల్లాల్లో అధిక వర్షపాతం, 19 జిల్లాల్లో సాధారణం, 10 జిల్లాల్లో లోటు వర్షపాతం ఉంది. ఇందులో జిల్లా ప్రస్తుతం ఐదో స్థానంలో ఉంది.

ఇదీ పరిస్థితి

అల్పపీడన ప్రభావంతో జిల్లాలో వానాకాలంకు ముందు ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. తర్వాత జూన్ మొదటి వారంలో తొలకరి పలకరించింది. అయితే మళ్లీ వరుణుడు ముఖం చాటేయడంతో వర్షాభావ పరిస్థితులు కనిపించాయి. అయితే చివరి వారంలో మంచి వర్షాలు కురవడంతో సాధారణ స్థితికి చేరుకుంది. జిల్లాలో రెండు మధ్య తరహా ప్రాజెక్టులు సాత్నాల, మత్తడివాగు ఉన్నాయి. ఈ రెండింటిలో క్రమంగా వరదనీరు వచ్చి చేరుతోంది. ఈ ప్రాజెక్టుల కింద సుమారు 35వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రధానంగా జిల్లాలో వర్షాకాలంలో వర్షాధారంగానే పంటలు పండిస్తున్నా యాసంగిలో కాలువల ద్వారా ఆయకట్టుకు సీరందుతుంది. ఈ పరిస్థితుల్లో ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండాల్సిన అవశ్యకత ఉంది. ఇదిలా ఉంటే జిల్లాలోని చెరువుల కింద సుమారు 25వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అవి కూడా ఇంకా నిండని పరిస్థితి. వారం రోజులుగా సాధారణం నుంచి మోస్తారు స్థాయిలో కురుస్తున్న వర్షాలతో చెరువులు, ప్రాజెక్ట్‌ల్లోకి వరదనీరు వచ్చి చేరుతున్నప్పటికీ అవి ఇంకా పూర్తిస్థాయిలో జలకళ సంతరించుకోలేదు.



మత్తడివాగు ప్రాజెక్ట్

జిల్లాలోని ప్రాజెక్టుల నీటి నిల్వ వివరాలు ..

ప్రాజెక్ట్	పూర్తిస్థాయి నీటిమట్టం	ప్రస్తుత నీటిమట్టం	పూర్తిస్థాయి నీటి సామర్థ్యం	ప్రస్తుత నీటి సామర్థ్యం
సాత్నాల	286.50 మీ.	282.20మీ	1.24టీఎంసీ	0.317 టీఎంసీ
మత్తడివాగు	277.50 మీ	275.70మీ	0.571టీఎంసీ	0.261టీఎంసీ

జిల్లాలో వర్షపాతం వివరాలు : (జూన్ 1 నుంచి జూలై 5వరకు)

సాధారణం	: 250.8 మి.మీ
కురిసింది	: 284.04 మి.మీ
వ్యత్యాసం	: 13శాతం అధికం
స్థితి	: సాధారణం

చెరువుల వివరాలు(నిండిన శాతం)

మొత్తం చెరువులు	:392
0–25శాతం	: 00
25–50శాతం	: 351
50–75 శాతం	: 41
75–100శాతం	: 00

ఆన్‌లైన్.. ఆలస్యం!

- ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆదిలాబాద్ రూరల్ మండలంలో వివిధ భూ సమస్యలకు సంబంధించి 1,394 దరఖాస్తులు అందాయి. అందులో ఇప్పటి వరకు 1,378 దరఖాస్తుల డేటా ఎంట్రీ పూర్తి చేశారు. వాటి పరిష్కారం కోసం పోర్టల్‌లో మాత్రం 14 మాత్రమే నమోదు చేయడం గమనార్హం.
- తాంసి మండలంలో భూ సమస్యలపై 393 దరఖాస్తులు అందాయి. సమస్యల పరిష్కారంపై దృష్టి సారించిన అధికారులు పోర్టల్‌లో ఇప్పటి వరకు కేవలం15 దరఖాస్తులు మాత్రమే నమోదు చేశారు. తహసీల్దార్ కార్యాలయాల్లో చేపడుతున్న దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ తీరుకు ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే.

- 'భూభారతి' నమోదులో ఇక్కట్లు
- పోర్టల్‌లో ఎంట్రీకి ఓటీపీ తప్పనిసరి
- క్షేత్రస్థాయిలో ఆటంకాలు.. నత్తనడకన ప్రక్రియ
- గడువులోపు పరిష్కారం అనుమానమే

కైలాస్‌నగర్: రెవెన్యూ సదస్సుల్లో అందిన భూ సమస్యలు పరిష్కరించాలంటే భూభారతి పోర్టల్‌లో రైతుల వివరాలు ఆన్‌లైన్ చేయాలి. ఇందుకు ఓటీపీ తప్పనిసరి. అయితే దీనిని చెప్పేందుకు రైతులు నిరాకరిస్తున్నారు. సాంకేతికంగానూ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఇలాగే కొనసాగితే నిర్దేశిత గడువు ఆగస్టు 14 వరకు పూర్తవడం ప్రశ్నార్థకమే అనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

ఇదీ పరిస్థితి..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి నూతన రెవెన్యూచట్టం అమల్లో భాగంగా గత నెల 3 నుంచి 20 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. ప్రతీ మండలానికి రెండు ప్రత్యేక బృందాలు నియమించి 509 రెవెన్యూ గ్రామాల్లో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. జిల్లాలోని 21 మండలాల పరిధిలో 11,995 దరఖాస్తులు అందాయి. వివరాల నమోదు చేపడుతూనే దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసి సమస్యలు సత్వరం పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం తహసీల్దార్లను ఆదేశించింది. ఆ దిశగా దృష్టి సారించిన అధికారులు ఇప్పటి వరకు 10,275 దరఖాస్తుల డేటా ఎంట్రీ పూర్తి చేశారు. మరో 1,720 దరఖాస్తుల వివరాలు నమోదు చేయాల్సి ఉంది.



సాత్నాల తహసీల్దార్ కార్యాలయంలో ఆన్‌లైన్ చేస్తున్న దరఖాస్తులు

అడ్డంకిగా మారిన ఓటీపీ

భూ సమస్యలు పరిష్కరించే దిశగా రైతులకు నోటీసులు జారీ చేస్తున్న తహసీల్దార్లు వాటిని పోర్టల్‌లో ఆన్‌లైన్ చేస్తున్నారు. వివరాలు నమోదు చేయగానే సంబంధిత రైతుల సెల్‌నంబర్‌కు ఓటీపీ వెళుతుంది. తదుపరి ప్రక్రియ కొనసాగించాలంటే ఓటీపీ నమోదు తప్పనిసరి. ఇందుకోసం తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సంబంధిత రైతులకు ఫోన్ చేయగా చాలా మంది ఓటీపీ చెప్పేందుకు నిరాకరిస్తున్నారు. మరికొంతమంది ఫోన్లు స్విచాఫ్ వస్తున్నాయి. ప్రస్తుతం సైబర్ నేరాలు జరుగుతున్న క్రమంలో రెవెన్యూ సిబ్బందికి ఇది తలనొప్పిగా మారుతోంది. కార్యాలయ సిబ్బంది నంబర్లు తెలిసి ఉండి, కొంత అవగాహన ఉన్న రైతులు మాత్రమే ఓటీపీ చెబుతున్నారు. ఇలాంటి వారి సమస్యలు పరిష్కారమవుతున్నాయి. ఇక ఫోన్ నంబర్‌కు ఆధార్ లింక్ చేసి ఉండకపోవడం, రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉండి లిఫ్ట్ చేయకపోవడం వంటి కారణాలు అవరోధంగా మారుతున్నట్లుగా తహసీల్దార్లు చెబుతున్నారు.

సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

భూ సమస్యలపై అందిన దరఖాస్తులను పోర్టల్‌లో నమోదు చేసేందుకు ఓటీపీ సమస్య తలెత్తుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. పరిష్కరించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా రెవెన్యూ సిబ్బందితో పాటు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించాం. గడువులోపు ప్రక్రియ పూర్తి చేసేలా దృష్టి సారించాం.

– శ్యామలాదేవి, అదనపు కలెక్టర్

వేగంగా సాగాలంటే..

- ఓటీపీ సమస్య తొలగి, ప్రక్రియ వేగంగా సాగాలంటే రెవెన్యూ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి.
- పోర్టల్‌లో దరఖాస్తులు నమోదు చేసే క్రమంలో సంబంధిత గ్రామ రైతులకు ముందుగానే సమాచారమందించాలి. వారు తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- పంచాయతీ కార్యదర్శులకు ఈ సమాచారం తెలియజేసి జీపీ కార్యాలయంలో వారి సెల్‌ఫోన్లతో అందుబాటులో ఉండి ఓటీపీ చెప్పేలా శ్రద్ధ వహించాలి.

కొనసాగుతున్న ఆర్డీవో వినోద్‌కుమార్

- విధుల్లో చేరని స్రవంతి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ ఆర్డీవోగా వినోద్‌కుమార్ కొనసాగుతున్నారు. అయితే శుక్రవారం మధ్యాహ్నం ఆయన బదిలీ కావడం, ఆ స్థానంలో నిజామాబాద్ జిల్లా బీసీ అభివృద్ధిశాఖ అధికారిగా పనిచేస్తున్న బి.స్రవంతిని నియమించిన విషయం తెలిసిందే. ఉత్తర్వులు అందుకున్న వెంటనే ఆమె విధుల్లో చేరేందుకు ఆదిలాబాద్‌కు విచ్చేశారు. శుక్రవారం రాత్రి వరకు ఆమె విధుల్లో చేరుతారని అంతా భావించారు.ఆర్డీవో బదిలీ, నూతన ఆర్డీవో నియామకంపై శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనం అధికార, ఉద్యోగవర్గాల్లో చర్చనీయాంశమైంది. ప్రస్తుతం రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ కొనసాగుతుంది. సదస్సులు విజయవంతంగా నిర్వహించడంతో పాటు పాలనా వ్యవహారా ల్లో చురుగ్గావ్యవహరిస్తున్న వినోద్‌కుమార్‌ను రిలీవ్ చేసినట్లయితే ఆ ప్రక్రియపై ప్రభావం చూపే అవకాశమున్నట్లుగా తెలుస్తోంది. ఈక్రమంలోనే కలెక్టర్ ఆమె చేరికపై ఆసక్తి కనబర్చలేదనే ప్రచారం సాగుతోంది. కలెక్టర్‌ను కలిసినప్పటికీ ఆమె బాధ్యతలు చేపట్టకపోవడం గమనార్హం.

పోడు భూముల్లో మొక్కలు నాటొద్దు

- అటవీ అధికారులను అడ్డుకున్న కేశవపట్నం గ్రామస్తులు
- రాస్తారోకోలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఇచ్చోడ: పోడు భూముల్లో మొక్కలు నాటొద్దంటూ మండలంలోని కేశవపట్నం గ్రామస్తులు శనివారం ఆందోళన చేపట్టారు. అటవీశాఖ వాహనాల్లో మొక్కలు తరలిస్తుండగా సిరిచెల్మ ఘాట్‌రోడ్డు వద్ద అడ్డుకున్నారు. రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. కొన్నేళ్లుగా తాము పోడు భూములు సాగు చేసుకుంటున్నామని, ప్రస్తుతం అందులో మొక్కలు నాటడం సరికాదన్నారు. సమాచారం అందుకున్న టైగర్‌జోన్ ఎఫ్‌ఆర్వో నాగవత్ స్వామి అక్కడికి చేరుకున్నారు. జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అక్కడికి చేరుకుని వారికి మద్దతు పలికారు. డీఎఫ్‌వోతో ఫోన్‌లో మాట్లాడి, మొక్కలు నాటే కార్యక్రమాన్ని విరమించుకోవాలన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. దీంతో అధికారులు, సిబ్బంది అక్కడి నుంచి వెనుదిరిగారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



రాస్తారోకోలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్, గ్రామస్తులు